క్లుప్తంగా

విద్యార్థులు సామాజిక చైతన్యం కలిగి ఉండాలి

ఎస్ఎంకే జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం యడవల్లి హనుమంతరావు



చిలకలూరిపేట: విద్యార్థులు సామాజిక చైతన్యం కలిగి ఉండాలని పసుమర్రులోని ఎస్ఎంకే జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం యడవల్లి హనుమంతరావు చెప్పారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో సోమవారం బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలు అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని చెప్పారు. ఆడపిల్లలు ఏ విషయంలోనూ తాము తక్కువ కాదన్న విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని తెలిపారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయినిలు అనుసూయ, ఆశాలత, ఉమాదేవి, శివకుమారి ఆడపిల్లలకు సంబంధించి ఏది మంచి స్పర్శ, ఏది చెడు స్పర్శ అనే విషయాలను వివరించారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న పాఠశాల పూర్వ విద్యార్థిని షేక్ ఆలియా విద్యార్థులు ఏ విధంగా లక్ష్యాలు నిర్దేశించుకొని చదవాలి అనే విషయంపై సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్కేఎండీ యాసిన్, అప్పారావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం పీఏసీయస్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా సురేంద్రబాబు



రొంపిచర్ల: మండలంలోని అన్నవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా నర్రా సురేంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అతడిని పలువురు గ్రామస్తులు, సీఈవోలు అభినందించారు. అభినందనలు తెలియజేసిన వారిలో మాజీ సొసైటీ అధ్యక్షులు పచ్చవ కోటేశ్వరరావు, పంచాయతీ మాజీ ప్రెసిడెంట్ పచ్చవ పూర్ణచంద్రరావు, పచ్చవ రామారావు. సీఇవోలు వై.వి.నారాయణ, దొప్పలపూడి శ్రీనివాసరావు, గానుగపెంట వీరారెడ్డి, జి.ఎన్.పాలెం సీఈవో పి.వి.రామిరెడ్డి, రహీం జానీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి

స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్.కిరణ్‌కుమారరెడ్డి



చిలకలూరిపేట టౌన్: అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ముందుగా ప్రతి ఒక్కరూ వాటిపై అవగాహన కలిగి ఉండాలని చిలకలూరిపేట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్.కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలోని భావనారుషి నగర్, మదర్ థెరిస్సా కాలనీల్లో సోమవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. ప్రమాదాల జరిగినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై స్వయంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎస్.వెంకయ్య, కె.పవన్‌కుమార్, జి.చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం



నాదెండ్ల: కృషి, క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతతో విద్యార్థులు జీవితంలో విజయాలు సాధించవచ్చని, ఇందుకు ఎంపీసీ ఇంటర్మీడియట్ విద్యార్థిని షేక్ అఫ్సా నిదర్శనమని కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న ఎంపీసీ విద్యార్థిని షేక్ అఫ్సా బెటర్మెంట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించింది. 470కు గాను 423 మార్కులు సాధించింది.
ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో విద్యార్థిని అఫ్సాను నగదు ప్రోత్సాహకం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని అఫ్సాను స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, వైస్‌ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, పీడీ నాగేంద్రబాబు, లైబ్రేరియన్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్

జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్



ఇక్కుర్రులో పింఛన్‌ను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బిలత్కర్ తెలిపారు. మండలంలోని అల్లూరివారిపాలెం, ఇక్కుర్రు గ్రామాల్లో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసాలో జిల్లాలో 2.80 లక్షల మంది లబ్ధిదారులకు రూ.190 కోట్లు ఈనెలలో పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలబెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజ, డీఆర్డీఏ పీడీ బాలునాయక్, టీడీపీ నాయకుడు కొల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శావల్యాపురంలో..
శావల్యాపురం: అర్హత నిరుపేదలకు అందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన శావల్యాపురం గ్రామం బీసీ కాలనీలో ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం పింఛనుదారులకు నగదు అందజేశారు. ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 6004 మంది పింఛనుదారులు ఉండగా అన్నీ గ్రామ సచివాలయ ఉద్యోగుల పింఛనుదారుల ఇంటింటికీ తిరిగి 85 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు తెలి పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి, రాష్ట్ర బీసీ సంఘం అధికార ప్రతినిధి బత్తుల వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈపూరులో...
ఈపూరు: మండలంలోని కొచ్చర్ల గ్రామ శివారులోని తండాలో అధికారులు పింఛన్ పంపిణీ కార్యక్రమం సోమవారం చేపట్టారు. ప్రభుత్వం అందజేసిన పింఛన్లను ఎంపీడీవో రంగనాయకులు, తహసీల్దార్ దిలిప్ కుమార్ పంపిణీ చేశారు.

నాదెండ్ల మండలంలో...
నాదెండ్ల: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లు అందిస్తున్నామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మండలంలోని లింగారావుపాలెం, నాదెండ్ల గ్రామాల్లో పెరిగిన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్ కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఎమ్మెల్యే పుల్లారావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, సర్పంచ్‌లు నెల్లూరి నారాయణమ్మ, మొగిలి నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

రొంపిచర్లలో....
రొంపిచర్ల: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం సోమవారం మండలంలో నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాలలో ఇంటింటికీ తిరిగి వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో దివ్యాంగుల కార్పోరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు.



నాదెండ్ల రామాపురం కాలనీలో పింఛను సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

యడ్లపాడు మండలంలో....
యడ్లపాడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందించే సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు ప్రతిరోజు పండగేనని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగారావుపాలెం, మైదవోలు, యడ్లపాడు గ్రామాల్లో సోమవారం ఆయన పాల్గొన్నారు.

తెలుగుదేశంలోనే సంక్షేమం
నరసరావుపేట: పేదలకు అసలైన సంక్షేమం అందించి అండగా నిలిచేది తెలుగుదేశం మాత్రమేననేది మరోసారి రుజువైందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో 1,3,5,6,7,9,11 వార్డులు, రొంపిచర్ల మండలం తుంగపాడు, అన్నవరం గ్రామాల్లో పెన్షన్ పంపిణీలో పాల్గొన్నారు.



శావల్యాపురం బీసీ కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



కొచ్చర్లలో పింఛన్లను అందజేస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్



రొంపిచర్లలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేసిన నాయకులు, ఉద్యోగులు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి రావిపూడి రమ్య
- అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది
- వేర్వేరు ప్రాంతాల్లో ర్యాలీలు

శావల్యాపురం: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, సతీష్, పాల్గొన్నారు.

ఈపూరులో....
ఈపూరు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డెంగ్యూ వ్యాధి నివారణ కార్యక్రమం, ఉధృత డయేరియా నివారణ కార్యక్రమాలపై సోమవారం వైద్య సిబ్బందికి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రంగ నాయకులు, సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్, కమలాకర్, ముప్పాళ్ల వైద్యులు డాక్టర్ షమీమ, డాక్టర్ బి.నవీన్ కుమార్ పాల్గొన్నారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, సీహెచ్‌వో రమణమూర్తి, హెచ్‌ఈ నరసమ్మ, పాల్గొన్నారు.

చిన్నారుల్లో డయోరియా ప్రాణాంతకర వ్యాధి
0–5 సంవత్సరాల లోపు చిన్నారుల్లో డయోరియా (అతిసార వ్యాధి) ప్రమాదకరమైనదని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. సోమవారం ఆరోగ్య కేంద్రంలో అతిసార వ్యాధిపై వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు.



శావల్యాపురంలో ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య అధికారులు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

రొంపిచర్లలో...
రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సోమవారం డెంగ్యూ వ్యతిరేక, అతిసార నివారణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అన్ని గ్రామ సచివాలయాలలో ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలు చేశారు. వైద్యాధికారులు డాక్టర్ యస్.రేవతిభాయి, బి.మురళీధర్ మాట్లాడుతూ 31వరకు నెలరోజుల పాటు డెంగ్యూ వ్యతిరేక దినోత్సవ వేడుకలు, జూలై 1నుంచి ఆగస్టు 31వరకు అతిసార నివారణ దినోత్సవ వేడుకలు జరుగుతాయన్నారు.

ఉరివేసుకుని యువతి ఆత్మహత్య



గుంటూరు రూరల్: ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గోరంట్ల దాసుల బజారులో నివాసం ఉండే బొమ్మల బాబూరావు కుమార్తె అభినయ (18) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, ఇంటిపక్కన వారు గమనించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు ఓప్రైవేటు సంస్థలో పనిచేస్తుంది. ఇంటర్ చదివింది. ఆత్మహత్యకు గల కారణాలు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

92.3 శాతం పెన్షన్లు పంపిణీ

యడ్లపాడు: సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియ తొలిరోజు యడ్లపాడు మండలంలో 92.3శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో వై శ్రీనివాసరావు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఒక్కొక్కరూ 50 నుంచి 60 కుటుంబాలకు కేటాయించామన్నారు. మండలం పరిధిలో 8073 మంది పెన్షన్ దారులు ఉన్నారని, మొదటి రోజున 7452 మందికి పంపిణీ చేసినట్లు వివరించారు.

హైస్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సు

- లింగారావుపాలెం జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు ఉచిత సౌకర్యం
- యడ్లపాడు, మైదవోలు విద్యార్థులకు తప్పిన ప్రయాణ ఇక్కట్లు

యడ్లపాడు: నిత్యం ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణించే విద్యార్థులను ప్రయాణకష్టాలు తప్పాయి. పాఠశాల హెచ్ఎం కె.వి.రామిరెడ్డి చొరవతో యడ్లపాడు నుంచి లింగారావుపాలెం హైస్కూల్‌కు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేశారు. చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.రాంబాబు నేతృత్వంలో సోమవారం డిపో ప్రతినిధి ఆంజనేయులు తొలిరోజు ప్రత్యేక సర్వీసును ప్రారంభించారు. ప్రత్యేక సర్వీసు ఏర్పాటు చేయడం, ఫ్రీ పాస్‌లను కల్పించడంతో యడ్లపాడు, మైదవోలు గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. హైస్కూల్ ఉపాధ్యాయులు, ఆర్టీసీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం, ఆర్టీసీ ప్రతినిధి మాట్లాడుతూ తమ పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం ఇప్పటికే 300 మంది విద్యార్థులు చేరినట్లు వెల్లడించారు. లింగారావుపాలెంతో పాటు ఉప్పరపాలెం, యడ్లపాడు, మైదవోలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వంద మందికి పైగా వస్తున్నారని తెలిపారు. ఈ సర్వీసు ప్రతిరోజు ఉదయం 8 గంటలకు, సాయంత్రం 4.30 గంటలకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ మీరావలి, పేరెంట్స్ కమిటీ కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం రాంబాబు

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

నరసరావుపేట రూరల్: డయేరియా వ్యాప్తి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈవోపీఆర్డీ కె.వి ప్రసాద్ తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల హెల్త్ క్లినిక్ సెంటర్‌లో సోమవారం డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిడబ్ల్యూఎస్‌సీ రమేష్, నవీన్‌కుమార్, మండల కోఆర్డినేటర్ అయ్యప్పరెడ్డి, ఏఎన్ఎం విజయలక్ష్మీ పాల్గొన్నారు. ఈసందర్భంగా వర్షాకాలం సీజన్ కావడంతో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. సీజనల్‌గా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయోరియా వ్యాప్తి చెందే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఓఆర్ఎస్ ఎలా వాడాలో ఏఎన్ఎం విజయలక్ష్మి వివరించారు.

భూములకు కౌలు వేలం

నాదెండ్ల: దేవాదాయ వ్యవసాయ భూములకు సోమవారం నాదెండ్ల గంగా పార్వతీ సమేత మూలస్థానేశ్వర స్వామికల్యాణ మండపంలో కౌలు వేలం నిర్వహించారు. నాదెండ్ల గ్రూపు టెంపుల్స్ సీఈవో ఎస్ తులశీదాస్, కాకుమాను గ్రూపు టెంపుల్స్ సీఈవో అశోక్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు నల్లమోతు విజయసారధి, కోటేశ్వరరావు హాజరయ్యారు. నాదెండ్ల గోవర్ధనస్వామి దేవాలయం ఆధీనంలో ఉన్న 87.92 ఎకరాలు రూ.10.05 లక్షలకు రైతులు దక్కించుకున్నారు. గతంలో ఇదే భూమి రూ.6,60,600లకు వేలం జరిగింది. నాదెండ్ల మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం ఆధీనంలోని 30.50 ఎకరాల భూమి రూ.3.39 లక్షలకు కౌలు వేలం జరిగింది. గతంలో ఇదే భూమి రూ.3,95,400లకు వేలం జరిగింది. నాదెండ్ల అన్నదాన సత్రం ఆధీనంలోని 2.66 ఎకరాలు గతంలో రూ.15 వేలకు కౌలు జరగ్గా, ప్రస్తుతం రూ.17 వేలకు రైతులు వేలం పాడారు. అప్పాపురం శ్రీ ఆంజనేయ దేవస్థానం ఆధీనంలోని 12.53 ఎకరాల భూమి గతంలో రూ.1,53,500లు కౌలు రాగా, ఈ ఏడాది రూ.2.20 లక్షలకు వేలం జరిగింది.

నూతన కమిటీ ఏర్పాటు

శావల్యాపురం: మండలంలోని శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ దేవాలయ ప్రాంగణంలో వినుకొండ నియోజకవర్గ స్థాయిలో యాదవ సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనంద గోపాల యాదవ అన్నదాన సత్రం ఏర్పాటు చేయటంతో పాటు నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సన్నెబోయిన బాబురావు, గోరంట్ల పెద యోగయ్య, స్వర్ణాల నాగేశ్వరరావు, కుమ్మరి సాంబయ్య,రాగాల వెంకట శివయ్య, దొడ్డా ఏడుకొండలు, అధ్యక్షులుగా కోలగాని కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా పొట్టిపాటి శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా ఏలికా శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పల్లెబోయిన ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా మర్రి దర్గారావు, చెవల వెంకటేశ్వర్లు, చిమటా కాశయ్య, మొనపాటి శ్రీనివాసరావు, కట్టా అంజయ్య, యలగాల సాంబయ్య, పిన్నెబోయిన రామాంజినేయులు, గుమ్మా వెంకయ్య, స్వర్ణాల వెంకట్రావు,యర్లగొర్ల రామలక్ష్మయ్య, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కృష్ణయ్య మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యుల సహకారంతో శ్రీనంద గోపాల యాదవ సంఘం అభ్యున్నతికి పాటుపడతామన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

చిలకలూరిపేటటౌన్: ధరణిలోన కనిపించి ప్రాణాలు కాపాడే దైవాలు వైద్యులేనని డాక్టర్ జి.నాగలక్ష్మి పేర్కొన్నారు. 'డాక్టర్ డే' కార్యక్రమాన్ని పట్టణంలోని రజక కాలనీలో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డయేరియా వ్యాధి నిర్మూలపై కాలనీలోని ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలువురికి ఓఆర్ఎస్ ప్యాకెట్లును పంపిణీ చేశారు. అనంతరం హాస్పిటల్ ఆవరణలో డాక్టర్ డేను పురస్కరించుకుని వైద్య సిబ్బంది డాక్టర్ జి. నాగలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై ఆస్పత్రిలో కమ్యూనిటీ ఆఫీసర్‌గా విస్తృత సేవలు అందించి ఉద్యోగ విరమణ చేస్తున్న బి.శివనాగేంద్రంను సత్కరించారు. ఈరంగంలో పని చేసే వారికి సహనం, ఓర్పు వారికి కవచాలని, అవి రోగులకు ఆశీర్వచనాలుగా పనిచేస్తాయని సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ స్టాఫ్ లక్ష్మి ప్రసన్న, సురేఖ, శ్యామలా, ఇస్సాకు, తిరుపతమ్మ, ఏఎన్ఎంలు కె.నాగలక్ష్మి, ధనలక్ష్మి, ప్రభావతి, సువర్ణలత, ఆషాలు శ్రీదేవి, రాజేశ్వరీ, అనంతలక్ష్మి, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో వైద్యులకు సత్కారం
నరసరావుపేట ఈస్ట్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీవాసవి మిత్రమండలి, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ వైద్యులను సత్కరించారు. ట్రస్ట్ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పట్టణ వైద్యులు డాక్టర్ సి.గౌతమి, డాక్టర్ నంద్యాల రాంప్రసాదరెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.పి.రంగారావు, చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి సత్యనారాయణ, మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, ట్రస్ట్ చైర్మన్ పి.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో....
రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్‌డే, చార్టెడ్ అకౌంట్ వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయా రంగాలలోని ప్రముఖులను సత్కరించారు. రోటరీ కమ్యూనిటీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ వైద్యులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, డాక్టర్ నాగోతు ప్రకాశరావు, డాక్టర్ జహీర్‌అబ్బాస్, డాక్టర్ పేరం రాజనందా రెడ్డి, డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి, చార్టెడ్ ఎకౌంటెంట్ చేకూరి సాంబశివ రావులను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కపలవాయి రాజేంద్ర ప్రసాద్, కార్యదర్శి సాతులూరి శివకుమార్, క్లబ్ మాజీ గవర్నర్ కె.పి.రంగారావు, డైరెక్టర్లు షేక్.జిలానీ మాలిక్, ఎం .సుమిత్ర కుమార్, రాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ ప్రైమరీ హెల్త్ హాస్పిటల్‌లో వైద్యులు జి.నాగలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం




ఉద్యోగ విరమణ సందర్భంగా సీవో బి.శివనాగేంద్రంను సత్కరిస్తున్న స్టాఫ్



వైద్యులను సత్కరిస్తున్న మిత్రమండలి ప్రతినిధులు

బంద్ జయప్రదం చేయండి

నరసరావుపేట: నీట్ నెట్ పరీక్ష పేపర్ లీకేజీను నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఈనెల నాల్గవ తేదీన దేశంలో గల విద్యా సంస్థలన్నీ ఎల్‌కేజీ టు పీజీవరకు బందుకు పిలుపునివ్వటం జరిగిందని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయి కుమార్, అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. దేశ గౌరవ ప్రతిష్ఠలకు విశిష్టమైన నీట్ పరీక్ష దేశ చరిత్రలో ఏనాడు కనివిని ఎరగని రీతిలో ఈ ఏడాది అవకతవకలు జరిగాయని ఆరోపించారు.



లబ్ధిదారులకు రేషన్ చేరాలి

- జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాదు
- బరంపేటలో సరుకుల పంపిణీ పరిశీలన

నరసరావుపేట: రేషన్ బియ్యం పొందే లబ్ధిదారులు అందరికీ త్వరితంగా రేషన్ సరుకులు అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బరంపేటలో మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్‌ను (పౌరసరఫరాల శాఖ సంబంధించి సంచార రేషన్ సరుకులు పంపిణీ వాహనం) ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్డుదారులకు అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తున్న కొలతలు, సంబంధిత పరికరాలను సునిశితంగా పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీటీ కొండారెడ్డి పాల్గొన్నారు.



బరంపేటలో ఎండీయు వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న జేసీ

వైభవంగా బొడ్డురాయి వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ సీతా రామాంబ తల్లి (బొడ్డు రాయి) 14వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ఉదయం జలాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. పూజారి కన్నా ఆధ్వర్యంలో కుంకుమ, ఆకు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ఆహ్వానించి తీర్థప్రసాదాలు అందించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సాయంత్రం బొడ్డురాయి వద్ద ప్రదర్శించిన సాంస్కృతిక భక్తి కార్యక్రమాలు, కావూరు, గణపవరం, అప్పాపురం గ్రామాల మహిళలు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, పుట్టినరోజు, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com